# చెత్తబుట్టలో పారిస్ పర్యావరణ ఒప్పందం

**పారిస్** పర్యావరణ ఒప్పందం నుండి వైదొలగు తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించటం పలువురిని విస్మయానికి గురిచేసింది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ స్వభావం గురించి తెలిసినవారికి, జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నవారికి ఇది ఊహించిన పరిణామమే.

ట్రంపుకు చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ఎనర్జీలోని అనుసంధాన విభాగాధిపతి అయిన థామస్ పైల్, కోచ్ సంస్థ ఫైనాన్సు చేసిన అమెరికన్ ఎనర్జీ అలయెన్సుకు కూడా అధిపతి. ఈయనే ట్రంపు పర్యావరణ విధానానికి రూపకర్త. కోచ్ – పరిశ్రమలు చమురురంగంలో దిగ్గజాలలో ఒకటి. పారిస్ ఒప్పందం నుండి బయటకు రావాలన్న విధానం 2016 డిసెంబరులోనే బహిర్గతమైంది. అది ఒబామా రూపొందించిన క్లీన్ పవర్ పాలసీని నిరసించి, పైపులైన్ల నిర్మాణాన్ని నిర్ధారణ చేసింది. పారిస్ ఒప్పంద సమయంలో అమెరికా సామ్రాజ్యవాద అధిపతి ఆ ఒప్పందాన్ని ఒక 'మైలు రాయి'గా పేర్కొన్నాడు. అంతేగాక 'ప్రపంచమంతా ఒక్కటై నిలిస్తే ఏది సాధ్యమౌతుందో మనం చూపించాం' అన్నాడు. ఆయన అనంతరం గద్దెనెక్కిన ట్రంప్ దానిని ('పారిస్ ఒప్పందం') అన్యాయమైనది అనటమేకాక, అది పనికిరాని చెత్త అన్న స్థాయికి వెళ్ళాడు.

31 పేజీల పారిస్ ఒప్పంద పత్రం – గ్రీన్‌హౌస్ వాయువుల (కర్బన ఉద్గారాల) విడుదలకు సంబంధించి ఏ దేశానికాదేశం స్వతంత్రంగా లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పింది. కానీ ఆచరణలో ఏ దేశమూ కూడా గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించే ప్రయత్నాలేమీ చేయలేదు. ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశాలన్నీ దీనిని నిర్ధారిస్తేనే ఇది ఆచరణలోకి వస్తుంది. ఇది అమలులోకి రావాలంటే మొత్తం గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలలో 55 శాతంగా గల కనీసం 55 దేశాలు నిర్ధారిస్తేనే దీని అమలు సాధ్యమౌతుంది. కనుక సామ్రాజ్యవాద దేశాలు నిర్ధారిస్తే తప్ప అమలుకాని స్థితికి ఈ ఒప్పందం చేరింది. గతంలో జరిగిన అనేక అంతర్జాతీయ ఒప్పందాలను ఉల్లంఘించినట్లే అమెరికా ఈసారి కూడా కర్బన ఉద్గారాలను తగ్గించుకోవటానికి ఒప్పుకోలేదు. అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలకు సంబంధించి కర్బన ఉద్గారాల పరిమితులను క్యోటో అనుబంధ ఒప్పందం నిర్ణయించింది. దీనిని అమెరికా తిరస్కరించింది. పారిస్ ఒప్పందానికి కట్టుబడి ఉండనవసరంలేని స్వచ్ఛంద స్వభావం ఉండటంవల్లనే అమెరికా సామ్రాజ్యవాద పాలకులు దానికి అంగీకరించారు.

గత 150 సంవత్సరాల పారిశ్రామికీకరణలో ప్రపంచ మొత్తంమీద విడుదల అయిన కర్బన ఉద్గారాలలో అమెరికా శాతం 28.8గా ఉండగా యూరప్ రెండవ స్థానంలో ఉంది. పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న సామ్రాజ్యవాదదేశాలు, దానిని సరిచేయటంలో వారి చారిత్రక బాధ్యతను విస్మరిస్తున్నాయి. కర్బన ఉద్గారాలను తగ్గించుకునే విషయంలో అత్యల్పంగా మాత్రమే వారు స్పందించారు. కానీ పారిస్ ఒప్పందంలో మూడవ ప్రపంచ దేశాలకు మాత్రం లక్ష్యాలను నిర్దేశించారు. గత మూడు దశాబ్దాల ప్రపంచీకరణలో ప్రజల జీవనోపాధికి ఆలవాలమైన నదులు, అడవులు, పర్వతాలు, భూమి వంటి సహజ వనరులన్నీ బహుళజాతి కంపెనీల ప్రయోజనార్ధం వ్యాపార సరుకులుగా మార్చబడ్డాయి. ఇది కోట్లాది మంది ప్రజల జీవనోపాధిని దెబ్బతీయటమేకాక, సహజ వనరులను విధ్వంసానికి గురిచేస్తూ మొత్తంగా పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నది. లాభార్జనే ధ్యేయంగా గల పెట్టుబడిదారీ విధానపు ఫలితమిది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి, మనిషిని ప్రకృతి నుండి వేరుచేస్తుందని, హద్దుల్లేని వనరుల దోపిడీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని 150 సం॥ క్రితమే కారల్‌మార్క్స్ అన్నారు. సమష్టి యాజమాన్యంలో సహజవనరులు నిర్వహించబడినప్పుడు మాత్రమే ఈ పర్యావరణ సంక్షోభానికి పరిష్కారం లభించగలదని, అది సోషలిస్టు సమాజంలో మాత్రమే సాధ్యపడుతుందని ఆయన అన్నారు.

ooooo